# 20 వ శతాబ్ది తెలుగు కథకులు
## డా. కేతు విశ్వనాథ రెడ్డి గారి ఆకాశవాణి ప్రసంగాలు



తెలుగు కథ శత వార్షికోత్సవాల సందర్భంగా 'కౌముది' పాఠకులకి

ప్రముఖ రచయిత కలం నుంచి నెలనెలా ప్రత్యేక వ్యాస పరంపర

### ప్రవర్తన తలుపులు తెరచిన పాలగుమ్మి పద్మరాజు

(1915 - 1983)



ఒక గాఢమైన జీవితానుభవం, ఆ అనుభవంలోని ఒకానొక ఘర్షణ, ఒక విశిష్టమైన అనుభూతి, ఆ అనుభూతిలోని దాగి ఉండే నిజం, ఒక విశిష్ట మూర్తిగా కనిపించే సామాన్య వ్యక్తి. ఆ వ్యక్తికీ అటువంటి ఇతర వ్యక్తులకూ మధ్య సంఘటన ద్వారా ఒరిపిడి ద్వారా, కలయిక ద్వారా సమాజం రూపొందే క్రమం - వీటిని మనం మరచిపోలేనంత స్పష్టంగా, రసవత్తరంగా, శిల్ప సమన్వితంగా కథలుగా మలచిన రచయిత పాలగుమ్మి పద్మరాజు.

పద్మరాజు తెలుగు కథకు అంతర్జాతీయ కీర్తిని తెచ్చిపెట్టారని మనం గర్విస్తున్నాం. 1952 లో న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్ నిర్వహించిన ప్రపంచ కథానికల పోటీలో ఆయన సొంతంగా ఇంగ్లీషులో రాసిన 'సైక్లోన్' అనే కథకు ద్వితీయ బహుమతి వచ్చింది. ఆ కథల సంకలనం చూసిన ప్రతి తెలుగు కథాప్రియుడూ సంతోషించాడు. సైక్లోన్ తెలుగు రూపం 'గాలివాన'.

గాలివానకు ముందు పద్మరాజు కొన్ని కథలను ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ రాశారు. 1938 - 39 ప్రాంతాల్లో ఆయన రాసిన తొలి ఇంగ్లీషు కథ 'సుబ్బి' అది, త్రివేణి పత్రికలో వచ్చింది. పద్మరాజు రాసిన కథలు అరవైదాకా ఉన్నాయి. ఆయన కథలే కాకుండా కవిత్వం రాశారు. నవలలూ, నాటకాలూ, నాటికలూ, వ్యాసాలూ, చలనచిత్ర కథలూ, సినీ సంభాషణలూ రాశారు. విస్తారంగా చేసిన అన్ని రచనల్లో ఆయన ముద్ర కనిపిస్తుంది. సౌష్టవమైన కథా శిల్పం, పాత్రల ప్రవర్తన, పునాదుల చిత్రణ, క్లుప్త, స్పష్ట, సన్నివేశ కల్పననూ కథా ప్రయోజనాన్నీ వాచ్యం చెయ్యకుండా చెప్పగలిగిన నేర్పూ, ప్రతి వాక్యంలోనూ శక్తీ పద్మరాజు కథల్లో కనిపిస్తాయి. చెప్పుకుంటున్నాం కాబట్టే తెలుగులో మంచి కథల ప్రస్తావన ఎప్పుడొచ్చినా 'గాలివాన' అంటున్నాం, 'పడవ ప్రయాణం' అంటున్నాం. 'వాన వచ్చిన రాత్రి' అంటున్నాం. 'కూలిజనం' అంటున్నాం. 'వియ్యన్న తాత మరణం', 'పుల్లి', అంటున్నాం. ఇంకా ఆయన రాసిన ఇతర కథల్ని తరచు ప్రస్తావించుకుంటున్నాం. 'చిట్టితల్లి', 'ఎదురు చూస్తున్న ముహూర్తం', 'మగ పురుషుడు ఆడస్త్రీ' లాంటి కథల్ని చర్చించుకుంటున్నాం.

పద్మరాజు కథలు ఈ శతాబ్దిని ప్రభావితం చెయ్యడానికీ, ప్రసిద్ధి పొందడానికీ మూడు ముఖ్యమైన కారణాలున్నాయి. మొదటి కారణం: మనల్ని కదిపి కుదిపే కథా వాతావరణ చిత్రణ. రెండో కారణం. పల్లెవాసుల్ని గురించి రాసినా, కూలీనాలీ జనాన్ని గురించి రాసిన, పట్టణ మధ్యతరగతి వాళ్ళను గురించి రాసినా, మనల్ని గాఢంగా తాకే శీల వైలక్షణ్యాలు, ప్రవృత్తి ప్రత్యేకతా ఉండే పాత్రల్ని

చిత్రించడం. మూడో కారణం: వివేచనకు సులభంగా దొరకని మమకారాలనూ, మోహాలనూ, ప్రేమలనూ, అనుభూతులనూ చిత్రించి "లోతుగా మాటుపడి ఉన్న మానవత్వాన్ని గాలివానలోని రావులో బిచ్చగత్తె వికసింప చేసినట్లు పాఠకుల్లో వికసింప చెయ్యగలగడం, లేదంటే జీవితంలోని క్లిష్టతను చూపి మనసు ఘూర్జిల్లచేయడం."

పాలగుమ్మి పద్మరాజు రాసిన రెండు మూడు ప్రాతినిధ్య కథల్ని ఈ సందర్భంలో ప్రస్తావించుకుందాం. ముందుగా గాలివాన కథనే తీసుకుందాం. ఇందులోని కథా వస్తువు క్రమబద్ధమైన జీవితాన్ని అంటిపెట్టుకుని, అది ఇతరుల్లో లేకపోతే ఏ మాత్రం సహించలేని ఒక వేదాంతి నైతిక దురహంకారం.

'గాలివాన'లోని ప్రధాన పాత్ర రావుగారు. క్రమశిక్షణ తప్పని వాణ్ణనీ, నీతిమంతుణ్ణనీ, అధీనం తప్పి ప్రవర్తించననీ అనుకునే మనిషి. పైగా వేదాంతి. ఆయన గాలివాన బీభత్సం వల్ల స్టేషన్‌లోని వెయిటింగ్ రూంలోనే రాత్రి గడపవలసి వస్తుంది. ఏ వేదాంతమూ మనస్థైర్యాన్ని ఇవ్వలేని గందరగోళం, ఒంటరితనం, చావు భయం. అంతకు ముందే రైల్లో చూసిన ముప్పై ఏళ్ళ బిచ్చగత్తె, తన పెట్టె, బేడా దించడానికి సాయపడ్డ బిచ్చగత్తె, రావుగారున్న గదిలోకి వస్తుంది. గాలివాన తీవ్రమవుతుంది. రావుగారిలో భయమూ ఎక్కువవుతుంది. రావుగారు బిచ్చగత్తె దగ్గరికి జరిగి, చనువుగా మాటల్లో పడతాడు. గాలి ఉధ్రుతికి గది తలుపు భళ్ళున తెరుచుకుంటుంది. రావుగారు గెంతి, బిచ్చగత్తెను కౌగలించుకుంటాడు. ఆమె ఒడిలో ధైర్యాన్నీ, వెచ్చదనాన్నీ, శాంతినీ అనుభవిస్తూ నిద్రపోతాడు.

తెల్లవారింది. గాలివాన తగ్గింది. రావుగారు నిద్రలేచి చూసుకున్నాడు. తన పర్సు కనిపించదు. చూస్తే అది బిచ్చగత్తె చేతిలో ఉంది. కాని ఆమె అప్పటికే మరణించి ఉంది. రావుగారికి దుఃఖం వస్తుంది. ప్రాణావసర సమయంలో శరీరానికీ, మనసుకూ బిచ్చగత్తె దగ్గరైంది. ఆమె చేసిన దొంగతనం పట్ల ఏహ్యాభావం కలగదు. పర్సులోని విజిటింగ్ కార్డు తీసుకొని బరువెక్కిన మనసుతో వెళ్ళిపోతాడు. మధ్య తరగతి బుద్ధిజీవి తెచ్చి పెట్టుకున్న విలువలకూ, ప్రవర్తనకూ అది క్షాళన.

'గాలివాన కథలో రావుగారి శీలవైచిత్రీ, గాలివాన సంఘటన కారణంగా ఆయన అంతరంగంలో జరిగిన ఘర్షణా, ఆయనలో అంతవరకు క్రమశిక్షణ కిందపడి ఉన్న సహజానుభూతులూ, మానవత్వమూ క్రమ క్రమంగా ఎక్కువ కావడం చిత్రితమయ్యాయి. ఈ కథ చదివి ముగించాక ఒక మూడ్ అంటే మనఃస్థితి మనకు కలుగుతుంది. ఆ మనఃస్థితిని గాలివాన వాతావరణం మరింత సాంద్రతరం చేస్తుంది. గాలివానలో సర్వసాక్షి కథన శిల్పం కూడా ఇందుకు తోడ్పడింది.

'పడవ ప్రయాణం' పద్మరాజుకు ఇష్టమైన కథ. 'తెలుగు కథకు ఈడొచ్చిందా?'అనే వ్యాసంలో ఈ విషయం తెలుపుతూ, పడవ ప్రయాణం కథ రచనా నేపథ్యాన్నీ, పాత్రల విరుద్ధ స్వభావాలనూ, తాను కథ చివరిలో చేశాననుకున్న పొరపాటునూ వివరంగా ప్రస్తావించారు. పడవ ప్రయాణం ఉత్తమ పురుషలో ఆత్మీయంగా సాగిన కథ. ఈ కథలోని 'నేను' అంటే కథ చెప్పే వ్యక్తి నిశితమైన పరిశీలనా శక్తి ఉన్న భావకుడు, జిజ్ఞాసి. పడవ ప్రయాణంలోని పాత్ర పోషణ పద్ధతిని గురించి పద్మరాజు స్వయంగా అన్న మాటలు విందాం:

"నా సమాజానికి - అంటే నేను నిత్యం మసిలే మధ్యతరగతి సమాజానికి కాస్త దూరంగా, నా మనస్సు ఒంటరి తనంతో, దిగులుతో, నిండిపోయిన అసందిగ్ధ సంధ్యాసమయంలో ఒక పడవ మీద - చిత్ర విచిత్రమైన ప్రవృత్తులతో, రంగుతో, రుచితో, నాకు దర్శనమిచ్చిన స్త్రీ పురుషుల కథ వ్రాయడానికి పూనుకున్నాను. ఇద్దరూ సమాజ నీతికి పొలిమేరలలో జీవిస్తున్న వ్యక్తులు. అతడామెను 'లేవదీసుకు' పోయాడు. లాంఛనంగా వాళ్ళకు పెళ్ళికాలేదు. కాని ఆమెలో ప్రతి అంగం అతనికోసం తహ తహలాడుతుంది. అతను ఎలాంటి వాడైనా సరే, ఎన్ని తప్పుడు పనులు చేసినా సరే. వాడు దొంగ. ఒక క్రమ పద్ధతికి, శిక్షణకు లొంగని స్వభావం వాడిది. ఆమెను అనేక విధాల దారుణంగా హింసించాడు. మరొక యువతితో వాడికి సంపర్కం ఉందని ఆమెకు తెలుసు. అయినా వాడు వచ్చి

బ్రతిమాలినప్పుడు, వాడితో కలిసి పడవెక్కి పడవలో సరుకులు వాడు దొంగలించడానికి సహాయపడింది. వాడు పట్టుబడకుండా దాటెయ్యడానికి సహాయ పడ్డం కోసం తను పడవలో ఉండిపోయింది. దెబ్బలు తింది. వాడి స్థానంలో తను జైలుకి పోవడానికి సిద్ధపడింది.

శ్రీరామచంద్రుని వంటి ఉత్తమోత్తముని ఆరాధించిన సీతకన్నా, ఒక మగవాణ్ణి క్రౌర్యం, పొగరు, అలక్ష్యం మూర్తీభవించిన వాణ్ణి - మరొక వ్యక్తికి ఎన్నడూ లొంగి ఉండని వాణ్ణి. మనసారా వాంఛిస్తూ, ఆరాధిస్తూ, అతనికోసం అవమానం, హింస కూడా భరించగలిగిన స్త్రీ మూర్తి ఎంతో గొప్పదనిపించింది. నా వయసులో.. అందుకే మసక మసకగా అంటే అందకుండా జారిపోతున్న చీకటి రాత్రిలో సమంగా ఆమె మూర్తిని గురించీ, ఆమె కథను గురించీ వ్రాశాను."

"పడవ ప్రయాణం'లోని మగవాడు పద్దాలు, ఆ స్త్రీ మూర్తి రంగి. స్త్రీ వాద దృక్పథం నుండి పరిశీలించినపుడు కథలోని మగవాణ్ణి మనం క్షమించలేము. రంగి మీద సానుభూతి ఏర్పడినా, పూర్తిగా ఆమోదించలేము. జీవించడంలోని హేతు రహిత మమకారాల వెనుక ఆయన మాటల్లోనే చెప్పాలంటే "నాగరికత ప్రపంచానికి కూడా అడుగున ఉన్న అసాంస్కృతికత, నాగరిక సంఘంలోని అనాగరికత" ఉందని మనం గుర్తిస్తాం. గుర్తిస్తాం అనడం కంటే గుర్తించేట్లు ఆయన కథా వస్తువును దిద్ది తీర్చారు, తీరుస్తారు.

'పడవ ప్రయాణం' కథలో కథకుడు పడవ దిగిపోయే ముందు జేబులోంచి ఒక రూపాయి తీసి చటుక్కున రంగి చేతిలో పెట్టి తొందరగా ఊళ్ళోకి పోతాడు. "కథకుడి కన్నా ఇచ్చిందా రూపాయి. ఆమె మూర్తికి విలువ కట్టినట్లయిపోయింది" అంటూ దీన్ని శిల్ప సంబంధమైన ఒక అసందర్భంగా పద్మరాజు గుర్తించారు. కథా రచనలో పద్మరాజు నుండి రచయితలు నేర్చుకోవలసిన సమ్యమనమూ, వినయమూ ఉందని మనం గుర్తిస్తాం.

'వానవచ్చిన రాత్రి' కథ ప్రకృతిలోని ఒక చలనానికీ, మూగవాడిలోని స్త్రీ వాంఛా సహితమైన ఆవేశ ప్రపంచానికీ మధ్య ఉండే అన్యోన్య ప్రేరణలూ, సంబంధాలూ, చిత్రితమయ్యాయి. భార్యలేని ఏకాంతం, జోరున కుర్తుస్తున్న వాన, పక్కవాటాల్లోని కిచకిచలు గరగరలు, నిద్రపట్టాక వచ్చిన కల, ఏదో పోగొట్టుకున్నట్లుండే ఒకానొక స్థితి ఇవన్నీ మనలో ఒక వాతావరణాన్ని కలిపిస్తాయి. పాత్ర మనస్థితిలాంటి మనస్థితిని కలిపిస్తాయి.

పద్మరాజు కథల్లో చాలా వాటిలో కథనం నేరుగా సాగుతుంది. అయితే వాటిలో గతం ప్రవేశిస్తుంది. భవిష్యత్తును సూచించే కలల చిత్రణ ఉంటుంది. కేవలం నిచ్చెన మెట్లలాగా ఉండే సంఘటనలూ, సన్నివేశాలతో కూడిన ప్రేమా కథనం కాక, ఆ కథనంలో మూడు కాలాలూ - అంటే వర్తమానం, గతం, భవిష్యత్తు - కలిసిపోతాయి. ఇవి పాత్ర పోషణకూణ పాత్రల అంతరంగ పరిణామాలకూ దోహదం చేస్తాయి.

పద్మరాజు మంచి కవిత్వం రాశారు. కథలోని వాతావరణ చిత్రణకు అవసరమైన వర్ణనలు చేసే సందర్భంలో మాత్రమే, ఆయన కథన శైలిలో కవితా స్పర్శ కనిపిస్తుంది. వేరే చోట్ల ఆయన కథన శైలి సరళమైంది. స్పష్టమైంది. నాగరికమైంది. పాత్రల ప్రాంతీయ సామాజిక నేపథ్యాలను బట్టి వేరు వేరు శైలులను ఉపయోగించడంలో ఆయన కథా నిర్మాణంలో పాటించవలసిన శైలుల అవగాహన మనకు అవగతమవుతుంది.

ప్రాచ్య పాశ్చాత్య రచయితలతోనూ, రచనా రీతులతోనూ పద్మరాజుకు గాఢమైన పరిచయం ఉంది. సాహిత్య ప్రపంచం మీద ప్రభావం చూపిన వివిధ తాత్త్విక ధోరణుల పరిచయమూ, మనో విజ్ఞాన శాస్త్రాంశాల పరిచయమూ ఆయనకున్నాయి. ఇవి ఆయన లోకాన్ని చూడడానికీ, దాన్ని అర్థం చేసుకోడానికీ, కథలుగా మలచడానికి సహకరించాయి. కథలు రాయడం అంటే చరిత్రనుంచీ పుట్టే పాతకొత్తల అవగాహనం అని తెలియచెప్పిన కథా రచయిత పాలగుమ్మి పద్మరాజు.